క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

అద్దంకి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని మునిసిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో గురువారం నిర్వహించనున్నట్లు పట్టణ పార్టీ నాయకులు కాకాని రాధాకృష్ణమూర్తి బుధవారం తెలిపారు. వైఎస్సార్‌సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య పాల్గొంటారన్నారు.

కోడి పందెం శిబిరాలపై దాడులు


పట్టుబడిన నిర్వాహకులతో పోలీసులు

అద్దంకి: మండలంలోని శంఖవరప్పాడు గ్రామ సమీపంలో కోడి పందాలు నిర్వహిస్తున్న శిబిరంపై పోలీసులు బుధవారం దాడులు చేశారు. 16 బైకులను, రెండు పుంజులను, పందేలు నిర్వహిస్తున్న 8 మందిని అదుపులోకి తీసుకుని, 11,430ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సమందర్‌వలి తెలిపారు. ఎక్కడైనా కోడి పందాలు నిర్వహిస్తే కఠిన తప్పవని హెచ్చరించారు.

పీఎఫ్‌జేఏవై కార్డు పొందండి


పీఎఫ్‌జేఏవై కార్డులపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో

బల్లికురవ: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఒక్కరూ పీఎఫ్‌జేఏవై కార్డు బయోమెట్రిక్ ద్వారా పొందాలని ఎంపీడీవో సీహెచ్ కృష్ణ కోరారు. బుధవారం సాయంత్రం ఉప్పుమాగులూరు పంచాయతీల్లోని సోమవరప్పాడు సచివాలయం 2లో పీఎఫ్‌జేఏవై కార్డులపై అవగాహన కల్పించారు. ఈ కార్డు పొందటం వల్ల రెండు లక్షల ఉచిత బీమాతో పాటు 5 లక్షల వరకు దేశంలోని ఏ వైద్యశాలలోనైనా వైద్యం పొందవచ్చని ఎంపీడీవో వివరించారు. వలంటీర్‌ల ద్వారా బయోమెట్రిక్‌తో కార్డులు ఉచితంగా పొందవచ్చన్నారు. ఈవోఆర్డీ జి. సీతామహాలక్ష్మి, సెక్రటరీ సీహెచ్ వరప్రసాద్ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం పుష్య మాసం జ్యేష్ఠ నక్షత్రం ద్వాదశి తిథి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని శింగరకొండ దేవస్థాన ఏసీ సుభద్ర బుధవారం తెలిపారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోష కాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

రసాయన మందులతో ప్రమాదం


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆత్మ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ అన్నపూర్ణ

చీరాల రూరల్: ఎదుగుతున్న పంటలకు విచక్షణా రహితంగా రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడటం వలన పంటల దిగుబడి తగ్గడమే కాకుండా అధికంగా ఖర్చులు పెరిగి పంటల నాణ్యత కూడా తగ్గిపోతుందని ప్రకాశం ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ కె. అన్నపూర్ణ రైతులకు సూచించారు. బుధవారం స్థానిక కుందేరు ఒడ్డున గల షాదీఖానాలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో భాగమైన చీరాల సబ్ డివిజన్ పరిధిలోని చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాల్లోని రైతులకు సమగ్ర యాజమాన్య పద్ధతులపై ఒకరోజు శిక్షణ తరగతులు, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో ముఖ్య అతిథిగా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ అన్నపూర్ణ పాల్గొని మాట్లాడారు. వరి, మొక్కజొన్న, వేరుశనగ పంటలపై సమగ్ర పురుగులు, తెగుళ్ల యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. పంటలపై తీసుకోవాల్సిన సస్య రక్షణలపై అమూల్యమైన సలహాలతో పాటు సమాచారం అందించారు. స్లైడ్స్ ద్వారా రైతులకు కళ్లకు కట్టినట్లు చూపించి అవగాహన కల్పించారు. అలానే పంట పొలాలకు రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడడం వలన భూమి సారం దెబ్బతింటుందని, తద్వారా పంటలో నాణ్యత లోపిస్తుందని చెప్పారు.

అటువంటివాటిని అరికట్టి నేల పంటలు మాత్రమే ఆరోగ్యవంతంగా ఉంటాయనే విషయాన్ని రైతులు గుర్తించాలని సూచించారు. పంటలు మంచి దిగుబడులు పొందాలంటే సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు వాడాలని, పచ్చిరొట్ట పైరుల పెంపకాన్ని అలవాటు చేసుకోవాలని ఆమె రైతులకు సూచించారు. వ్యవసాయ పరిశోధనా సంస్థ దర్శి ప్రిన్సిపాల్ సైంటిస్టు డాక్టర్ ప్రమీల రాణి మాట్లాడుతూ వివిధ పంటలలో కలుపు నివారణ అరికట్టి మంచి దిగుబడులు సాధించాలని సూచించారు. సదస్సులో చీరాల సబ్ డివిజన్ ఏడీఏ ఎన్. ఉషారాణి, ఒంగోలు ఏడీఏ ప్రభాకరరావు, ఏవో ఏషమ్మ, బాపట్ల ఏవో ఉమామహేశ్వరరావు, మాబ్ చైర్‌పర్సన్ రమణారెడ్డి, మూడు మండలాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

ఆమంచిని కలిసిన దుకాణాల యజమానులు


పర్చూరు ఆమంచి కృష్ణమోహన్‌కు సమస్యను చెపుతున్న షాపుల యాజమానులు

పర్చూరు: వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌ను పర్చూరులోని షాపుల యాజమానులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పర్చూరులోని ఇంకొల్లు రోడ్డుకు ఇరువైపుల ఉన్న షాపుల తొలగింపునకు సంబంధించి పరిష్కారం చూపించాలని కోరగా ఆమంచి కృష్ణమోహన్ స్పందించి సమస్య పరిష్కారం కొరకు కృషి చేస్తానని తెలిపారు. కారంచేడు ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, మాజీ ఎంపీపీ కోట హరిప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు తోకల కృష్ణమోహన్, వైఎస్సార్‌సీపీ నాయకులు లంకా శివ, మల్లా శ్రీనివాసరావు, అడపా సుధాకరరెడ్డి, ముప్పాళ్ళ రాఘవయ్య, నాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న అడ్వకేట్ ఏవీ సుబ్బారెడ్డి

వేటపాలెం: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చీరాల న్యాయ సేవాధికారి సంస్థ ప్యానల్ అడ్వకేట్ ఏవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మండలం పరిధిలోని రామన్నపేట వినాయకపురంలో ఎస్టీ కాలనీలో చీరాల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ శ్రామిక్ పథకం, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన కల్పించారు. విద్య ప్రాధాన్యత గురించి, వివిధ కార్మిక సంక్షేమ పథకాల, చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్టీలు మాట్లాడుతూ తాము జీడిపప్పు ఫ్యాక్టరీల్లో పని చేస్తుంటామని తెలిపారు. అయితే జీడి పప్పు ఫ్యాక్టరీలో పనిచేయడం వల్ల తమ వేలిముద్రలు సక్రమంగా పడక రేషన్ సరుకులు, సామాజిక పింఛన్లు సమయంలో వేలి ముద్రలు సక్రమంగా పడక ఇబ్బందులు ఎదుర్కొవడం జరుగుతుందని తెలిపారు. ఈ విషయం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళతామని తెలిపారు. న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ అడ్వకేట్ సతీష్ రెడ్డి, పారా లీగల్ వలంటీర్లు ఎస్ఎం సుభాని పాల్గొన్నారు.

రికవరీలపై దృష్టి పెట్టాలి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పీడీ అర్జునరావు

అద్దంకి రూరల్: స్త్రీనిధి, ఉన్నాతి, సీఐయస్ వీఆర్ఎఫ్ రికవరీలపై వీవోఏలు దృష్టి పెట్టాలని డీఆర్‌డీఏ వైఎస్సార్ కేపీ ప్రాజెక్టు డైరెక్టర్ అర్జునరావు అన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెటింగ్ యార్డులో నియోజకవర్గ పరిధిలోని 5 మండలాల వీవోఏకు జీవనోపాధులపై అవగాహన కల్పించారు. పీడీ మాట్లాడుతూ జనవరి 26 రిపబ్లిక్ డే సందర్భంగా ఎస్సీ, ఎస్టీలకు వాహనాలు ఇప్పించేందుకు టార్గెట్‌ను నిర్ణయించారన్నారు. ఉన్నతి డీపీఎం యం. రమేష్ మాట్లాడుతూ ఉన్నతి ద్వారా ఎస్సీ, ఎస్టీలకు వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నట్లు చెప్పారు. అవకాశాన్ని ఎస్‌హెచ్‌జీలోన్న ఎస్సీ, ఎస్టీలు వినియోగించుకోవాలన్నారు. ఏసీ రవికుమార్, స్త్రీనిధి ఏజీఎం హర్ష, డీపీఎం బ్యాంక్ లింకేజ్ ఆచారి, ఏపీఎం రామకృష్ణ, హెచ్‌ఆర్ సుబ్బారావు, ఐదు మండలాల ఏపీఎంలు, స్త్రీనిధి మేనేజర్ నాగశంకర్ పాల్గొన్నారు.

మహిళా సంఘాలను బలోపేతం చేయాలి

పర్చూరు: మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడంతోపాటు జీవనోపాధులు ఏర్పాటు చేయడం ముఖ్యమైనదని డీఆర్‌డీఏ పీడీ అర్జునరావు అన్నారు. బుధవారం అద్దంకి నాంచారమ్మ అమ్మవారి కల్యాణ మండపంలో పర్చూరు, ఇంకొల్లు, యద్దనపూడి మార్టూరు మండలాల్లోని వీఓఏలకు, గ్రామ సంఘం సహాయకుల సమీక్ష సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ ప్రతి మండలం నుంచి 100 యూనిట్లు జీవనోపాధి యూనిట్లు టార్గెట్‌గా నిర్ణయించినట్లు తెలిపారు. పెరటికోళ్ళ పెంపకం, గేదెలు, గొర్రెలు పెంపకం, ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాట్లు మొదలైన అంశాలపై వీఓఏలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. సమీక్ష సమావేశంలో నెలవారీ ప్రగతిపై సమీక్ష జరిగిందని తెలిపారు. బ్యాంకు లింకేజి, స్త్రీనిధి ఉన్నతిపై అవగాహన కల్పించామన్నారు. పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఈఎం, జగనన్న బడుగు వికాసం, గృహ నిర్మాణంపై సమీక్షించినట్లు చెప్పారు. ఏరియా కోఆర్డినేటర్ అంబేడ్కర్, డీపీఎంలు రవికుమార్, సుబ్బారావు, హర్షవర్ధన్, ఏపీఎంలు, సీసీ, వీఓఏలు పాల్గొన్నారు.

వాహనాలపై కేసు నమోదు


దగ్గుబాడు వద్ద మట్టి తోలకాలను నిలిపివేసిన ఎస్ఐ అనిత

దగ్గుబాడు (కారంచేడు): అక్రమంగా ఇసుక, మట్టి తోలకాలు చేసేవారిపై ఉక్కుపాదం మోపుతున్నామని ఎస్ఐ ఎం. అనిత తెలిపారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు గ్రామాల్లో అనుమతులు లేని ఇసుక మట్టి తోలకాలు చేస్తే సహించేదిలేదన్నారు. బుధవారం మండలంలోని దగ్గుబాడు చెరువు వద్ద నుంచి అక్రమంగా మట్టిని క్రేన్‌ల సాయంతో తీసి, టిప్పర్ వాహనాల్లో తరలిస్తున్నారనే సమాచారంతో అక్కడకు వెళ్ళి ఒక క్రేన్‌ను, నాలుగు టిప్పర్‌లపై కేసు నమోదు చేశామన్నారు. అయితే వాటికి సంబంధిత అధికారుల అనుమతులు ఉన్నాయని, అక్కడ నిర్వాహకులు తెలియజేయగా, అనుమతులు తీసుకొని వచ్చి చూపించి వాహనాలు తీసుకెళ్లాలని ఎస్ఐ సూచించారు.

పెద్ద నక్కలపాలెంలో నేత్రదానం


నేత్రాలను దానం చేసిన నాగేంద్రమ్మ

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని పెద్ద నక్కలపాలెం గ్రామానికి చెందిన బాచిన నాగేంద్రమ్మ(90) బుధవారం మృతి చెందడంతో ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. ఆమె కుటుంబ సభ్యులు సత్యనారాయణ, లింగమ్మ, కుమారి అనుమతితో నేత్రాలను గుంటూరు శంకర నేత్రాలయం వైద్యులు కార్నియాలను సేకరించారు. ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు జెట్టి వెంకటేశ్వర్లు, సోమేపల్లి రామ్మోహనరావు, అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి భవనం అంజిరెడ్డి, కరి కమలేశ్వరరావు, వంకాయలపాటి శ్రీమన్నారాయణలు కుటుంబ సభ్యులను అభినందించారు.

ఇంటి నిర్మాణాలు చేపట్టండి


గుంటుపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో

బల్లికురవ: ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా అర్హులైన పేదలకు మంజూరు చేసిన పక్కా గృహాలను నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేసుకోవాలని బిల్లు చెల్లింపులో జాప్యం లేదని ఎంపీడీవో సీహెచ్ కృష్ణ అన్నారు. బుధవారం సాయంత్రం గుంటుపల్లి, పెద అంబడిపూడి సచివాలయాల్లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు లబ్ధిదారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. రెండు గ్రామాలకు 32 ఇళ్లు మంజూరువగా ఇంకా పది గృహాలు అసలు నిర్మాణ పనులు చేపట్టలేదని, నిర్మాణాలు చేపట్టకపోతే రద్దవుతాయని చెప్పారు. ఈవోఆర్డీ జి. సీతామహాలక్ష్మి, గుంటుపల్లి సర్పంచ్ యం. కృష్ణ కుమారి పాల్గొన్నారు.

సీఎంను కలిసిన కృష్ణ చైతన్య, గరటయ్య


సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి బోకే అందిస్తున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ కృష్ణచైతన్య


ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో మాజీ ఎమ్మెల్యే బీసీహెచ్ గరటయ్య

అద్దంకి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని బుధవారం తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య, మాజీ ఎమ్మెల్యే బీసీహెచ్ గరటయ్య బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సమస్యల గురించి, అభివృద్ధి పనులు, యర్రం చిన పోలిరెడ్డి ఎత్తిపోతల పథకం, భవనాశి చెరువు అభివృద్ధి, అద్దంకి రింగ్ రోడ్డు, బల్లికురవ మండలంలోని చెరువుల అభివృద్ధికి సంబంధించి వివరాలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటింటా వైద్యం


కూకట్లపల్లిలో రోగులను పరీక్షిస్తున్న 104 వైద్యాధికారి

బల్లికురవ: ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఇంటింటా వైద్య సేవలు అందించేందుకు త్వరలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యాన్ని అందుబాటులోకి తెస్తుందని 104 వైద్యాధికారి నాగేశ్వరరావు అన్నారు. బుధవారం కూకట్లపల్లి గ్రామంలో 104 శిబిరంలో భాగంగా 43 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సాయంత్రం ఇంటింటికి వెళ్లి వృద్ధులు, బాలింతలు, గర్భిణులను పరీక్షించారు. వైద్య సిబ్బంది విష్ణు, డేవిడ్, మంజూషా, సుజాత, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో అలసత్వం వద్దు


కారంచేడులో ఎంపీడీఓ విజయలక్ష్మిని అభినందిస్తున్న అధికారులు

కారంచేడు: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో సంబంధిత సిబ్బంది అలసత్వం వహించవద్దని నూతన ఇన్‌చార్జ్ (ఎఫ్ఏసీ) విజయలక్ష్మి అన్నారు. బుధవారం ఆమె స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో పూర్తి అదనపు బాధ్యతలతో ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించి సిబ్బందితో మాట్లాడారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన రమేష్ బాబు వ్యక్తిగత కారణాలతో సెలవులో వెళ్ళారు. ఉన్నతాధికారుల నుంచి ఈ ఉత్తర్వులు వచ్చాయి. కార్యాలయ సిబ్బంది తమ పనులను సక్రమంగా నిర్వహించాల్సి ఉందన్నారు. బాధ్యతలు తీసుకున్న విజయలక్ష్మిని వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు, మాజీ వైస్ ఎంపీపీ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కార్యాలయ సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణ, పంచాయతీరాజ్ ఏఈ సీహెచ్ రామచంద్రుడు, ఏపీఓ ప్రదీప్, అన్ని గ్రామాల కార్యదర్శులు అభినందనలు తెలిపారు.

మెకానిక్ నిజాయితీకి ప్రశంస


మోపెడ్‌ను పోలీసులకు అందిస్తున్న మెకానిక్

చీరాల అర్బన్: కొద్ది రోజులుగా మెకానిక్ షాపుల వద్ద ఉన్న టీవీఎస్ మోపెడ్‌ను పోలీసులకు అప్పగించి తన నిజాయితీని చాటాడు ఓ మెకానిక్. పట్టణంలోని శాంతి థియేటర్ పక్క రోడ్డులో గత ఐదు రోజులుగా ఓ టీవీఎస్ మోపెడ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్లిపోయారు. గమనించిన మెకానిక్ షేక్ జిలానీ పోలీసులకు విషయాన్ని తెలియచేశాడు. అలానే మెకానిక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మీరా ఆధ్వర్యంలో మోపెడ్‌ను పోలీసులకు అందించారు. వాహనంలోని పార్టులు వేరు చేసి అమ్ముకోకుండా నిజాయితీగా పోలీసులకు అప్పగించడంపై ఒన్‌టౌన్ సీఐ వి.మల్లిఖార్జునరావు మెకానిక్ జిలానీని అభినందించారు.

రాష్ట్రంలో సుపరిపాలన


సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న కరణం వెంకటేష్

చీరాల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. బుధవారం రాత్రి చీరాల పట్టణంలోని 13వ వార్డులోని హైయర్‌పేట సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులోని ప్రతి అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజాబలంతో మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలన్నారు. వలంటీర్ల ద్వారా నేరుగా లబ్ధిదారులకే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రజలకు సమస్యలేమైనా ఉంటే వాటిని కూడా సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. నవరత్నాల పథకాలను అర్హులందరూ సద్వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం వార్డులోని ప్రతి గడపకు వెళ్లి కుటుంబ సభ్యులను పలకరించి ప్రభుత్వం అన్నివర్గాల వారికి అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. వార్డులోని సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకుని తగు పరిష్కారం చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి మూడేళ్లుగా ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించి బుక్‌లెట్‌ను అందించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, మున్సిపల్ కమిషనర్ ఐసయ్య, వార్డు నాయకులు కట్టా చంద్ర, కొణిదల బుజ్జి, దేవరపల్లి మేరి, ఎరిచర్ల తిమోతి, దేవరపల్లి దావీదు, సలగల అమృతరావు, బొనిగల భాను, వి.శ్రీను, వాసు, మాతట్టి కిషోర్, సయ్యద్ అమీర్, షేక్ అల్లాబక్షి, ఆర్‌బీకే చైర్మన్ కావూరి రమణారెడ్డి, కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి విరాళం


ఆశ్రమ నిర్వాహకులకు నగదు అందజేస్తున్న దాతలు

మార్టూరు: స్థానిక అమ్మ అనాథ ఆశ్రమం నూతన భవన నిర్మాణానికి అకౌంట్స్ విభాగంలో పనిచేస్తున్న జూపూడి ఏడుకొండలు, ఉమాదేవి దంపతులు అమ్మ ఆశ్రమం నూతన భవన నిర్మాణానికి రూ. 10 వేలు అందజేశారు. నగదును బుధవారం ఆశ్రమం అధ్యక్షులు గుంటుపల్లి చందు, విజయలక్ష్మి దంపతులకు వారందజేశారు. ఆశ్రమ అధ్యక్షుడు గుంటుపల్లి చందు ధన్యవాదాలు తెలియజేశారు.

అసైన్డ్ భూముల విచారణ


కూకట్లపల్లి అసైన్డ్ భూములపై విచారణ చేపడుతున్న తహసీల్దార్

బల్లికురవ: కూకట్లపల్లి గ్రామంలో సర్వే నంబర్ 290, 291, 292, 500, 501, 502 లో సుమారు 150 ఎకరాల అసైన్డ్ భూములకు సంబంధించి బుధవారం సాయంత్రం తహసీల్దార్ పి. సీతారత్నం విచారణ చేపట్టారు. ప్రభుత్వం దళితులకు ఇచ్చిన ఈ భూములు అన్యాక్రాంతం కావటంతో ఇటీవల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దళితులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. భూములను ఆక్రమించుకున్నవారికి నోటీసులు జారీ చేస్తామని తహసీల్దార్ చెప్పారు. సచివాలయ సర్వేయర్, ఎస్.కె బాషా, భూపోరాట కమిటీ సభ్యులు గుండ్లూరు లాభాలు, వేల్పుల ఏబు, తంగిరాల రాణమ్మ, గొల్లపూడి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భావనారుషిస్వామి రథోత్సవం


భావనారుషి స్వామి రథోత్సవం


సాయిబాబాకు పుష్పయాగం


భద్రావతి సమేత భావనారుషిస్వామి వారికి పూజలు చేస్తున్న దృశ్యం

చీరాల అర్బన్: పేరాలలో వేంచేసియున్న శ్రీ భద్రావతి సమేత భావనారుషి స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి స్వామి వారి రథోత్సవాన్ని కన్నుల పండువగా జరిగింది. ఆలయాన్ని విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు నిర్వహించారు. స్వామివారిని రథంపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. వీధుల్లో బొమ్మల అంగళ్ళను ఏర్పాటు చేశారు. రథోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన వారితో ఆ ప్రాంతమంతా కిక్కిరిసిపోయింది. మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, దేవస్థాన కమిటీ సభ్యులు రథోత్సవ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సాయినాథునికి పుష్పయాగం

చీరాల అర్బన్: పట్టణంలోని పాపరాజుతోటలోని శ్రీషిర్డీ సాయిబాబా మందిర వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. సాయిబాబాకు పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం 165 రకాల పుష్పాలను ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించి వాటితో పుష్పయాగాన్ని నిర్వహించారు. కార్యక్రమాలను మందిర కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.